క్లుప్తంగా

ఫ్లైఓవర్‌పై భారీ వాహనాలు వెళ్తే కేసులు నమోదు

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లైఓవర్‌పై గూడ్స్, బస్సులు ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆరాంఘర్ చౌరస్తా నుంచి మెహదీపట్నం వైపు ఫ్లైఓవర్‌పై భారీ వాహనాలు రాకుండా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లై ఓవర్‌పై భారీ వాహనాలు నడపకూడదని సూచించారు. ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి గొడుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడ జడ్పీహెచ్ఎస్‌లో టీఎస్‌యూటీఎఫ్ 5వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల 13,14వ తేదీలలో ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడలోని ఎస్ఆర్ సార్థా కన్వెన్షన్‌లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవ సభలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి కె.కె శైలజ, విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ శేరిలింగంపల్లి మండల అధ్యక్షులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సింహులు, ఉపాధ్యాయులు సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్‌లు ప్రారంభం

రాజేంద్రనగర్: కాలనీవాసులంతా కలిసి కమ్యూనిటీ హాల్‌లో రీడింగ్ రూములను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. టీచర్స్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీహాల్ రీడింగ్ రూమ్‌లను ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, మాజీ కార్పొరేటర్ శ్రీలత మహాత్మ, అడిషనల్ ఎస్పీలు వెంకటేశ్వర్లు, అనూప్‌కుమార్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్, రగడంపల్లి శ్రావణ్, పోరెడ్డి ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మైలార్‌దేవ్‌పల్లి: ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి శాంతినగర్‌కు చెందిన నీలేష్‌కుమార్(23) ప్రైవేటు ఉద్యోగి. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలోఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చిల్లరదొంగలు..చేతివాటం



రెయిలింగ్‌ను తొలగించి ఎత్తుకెళ్తున్న దొంగ


రాజేంద్రనగర్: రాత్రీపగలు అన్న తేడా లేకుండా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలు, కాలనీల్లో తిరుగుతూ అందిన కాడికి దోచేస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిల్లర దొంగల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. సోమవారం రాత్రి పిల్లర్ నంబర్ 186 వద్ద ఒక వ్యాపార సముదాయం ముందు నిర్వాహకుడు స్టీల్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేయించాడు. దీనిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇవి సీసీ కెమెరాలో కూడా రికార్డు అయ్యాయి. కిస్మత్‌పూర్, బుద్వేల్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో చిల్లర దొంగలు మధ్యాహ్నం సమయంలో రెచ్చిపోతున్నారు. గతంలో రక్షక్ వాహనాలతో పాటు మొబైల్ పెట్రోలింగ్ ద్వారా పోలీసులు బస్తీలు, కాలనీలలో పెట్రోలింగ్ నిర్వహించేవారు. దీంతో దొంగలు సైతం దొంగతనాలు చేసేందుకు భయపడే వారు. ప్రస్తుతం పోలీసుల గస్తీ అంతంత మాత్రంగానే ఉందనే ఆరోపణలున్నాయి.

కనిపిస్తే..కబ్జా



ఖాళీ స్థలంలో చేపట్టిన నిర్మాణం

రాజేంద్రనగర్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో జీహెచ్ఎంసీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాలనీలు, బస్తీలు వెంచర్లలోని ఓపెన్ ల్యాండ్స్, పార్కులు కబ్జాకు గురవుతున్నా కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుద్వేల్‌లో జన చైతన్య హౌసింగ్ లిమిటెడ్ హుడా లేఅవుట్ చేసింది. ఈ సందర్భంగా 24 పార్కులు, ఓపెన్ ల్యాండ్‌తో పాటు ఎస్‌టీపీల కోసం స్థలాలను వదిలేసింది. ఈ లేఅవుట్‌లోని పార్కు, ఓపెన్ స్థలాలను 2004 జూన్ నెలలో జీహెచ్ఎంసీకి రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు అందించింది. ఈ పార్కుల నిర్వహణకు జీహెచ్ఎంసీ గతంలో బౌండరీలు ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉన్నా, ప్రస్తుతం రోజురోజుకు స్థలాల విలువ పెరగడంతో కొందరు కబ్జాదారులు నకిలీ దస్తావేజులు సృష్టిస్తూ పార్కు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. 800 గజాల్లో ఒకరు నిర్మాణం మొదలు పెట్టారు. ప్రహరీ కోసం గోతులు తవ్వి అనంతరం 300 గజాల స్థలంలో నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇవేవీ జీహెచ్ఎంసీ అధికారులకు కనిపించడం లేదు.



లేఅవుట్‌లోని ఖాళీ స్థలం (వృత్తాకారం)

విజేతలకు పతకాలు అందజేత

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో 4వ ఫెడరేషన్ కప్, టోంగ్-ఇల్ మూ-డో స్టేట్ లెవల్ ఛాంపియన్‌షిప్ 2023 ఎంపిక ట్రయల్స్ నిర్వహించారు. తెలంగాణకు చెందిన టోంగ్-ఇల్ మూ-డో అసోసియేషన్ నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్ విజేతలకు పతకాలు అందజేశారు. బంగారు పతకం అక్షిత్, శశివర్ధన చైతన్య, విఘ్నేశ్విత, మనస్విత్‌రెడ్డి, అక్షర, వైశిత్, నికేష్, వెండి పతకం ఆదిత్య, శివకుమార్, సతీక్‌రెడ్డి, నిహాల్‌రెడ్డి, దర్శ్, సంస్కృతి, ప్రవస్వి, విష్ణు, శివచరణ్‌లకు పతకాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో టాక్-టాకిల్ ఫైట్ (గ్రూప్ ఫైట్)కు ద్వితీయ బహుమతి లభించింది. కార్యక్రమంలో భారత మాజీ సైనికుడు ఎం.కృష్ణారెడ్డి, టోంగ్-ఇల్ మూ-డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, జి.సత్యనారాయణ, ఎస్.శివయ్య పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్

సీఎం సహాయనిధి ఎల్ఓసీ అందజేత



బండ్లగూడ: సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్ ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకటయ్యకు మోకాళ్ల చికిత్స కోసం లక్ష రూపాయల సీఎం సహాయ నిధి ఎల్ఓసీని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ టీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్.స్వామి, ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, రాజేష్‌యాదవ్ తదితరులున్నారు.



కేలండర్‌ను ఆవిష్కరించిన అతిథులు

కేలండర్ ఆవిష్కరణ

మణికొండ: కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ కేంద్రంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని, వాటిని రాబోయే రోజుల్లో మరింత విస్తరించాలని కమ్మ సంఘం సీనియర్‌నాయకుడు గూడూరు సత్యనారాయణ అన్నారు. మంగళవారం మణికొండ కాకతీయ సేవా సమితి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు లక్ష్మీనాగేశ్వర్‌రావు, ఎ. నవీన్‌కుమార్, సమితి ఉపాధ్యక్షులు జగదీష్, మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్, కోశాధికారి శివశంకర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కుమ్మర సంఘం ఆధ్వర్యంలో..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం అధ్యక్షుడు ప్రకాష్ మంగళవారం ఆవిష్కరించారు.సంఘం నాయకులు నాగరాజ్, మురళీ, అశోక్, పెంటయ్య, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాంతినగర్ విరాట్ విశ్వకర్మ ఆలయంలో సంఘం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాండుయాదవ్, రవీందర్‌చారి,జ్ఞానేశ్వర్‌చారి, లక్ష్మణ్, షకీల్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శంషాబాద్ రూరల్: మండలంలోని రషీద్‌గూడలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ రాణిరవి అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.దినకర్‌గౌడ్, డైరెక్టర్ మోహన్‌రావు, ఉప సర్పంచు జగన్‌మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్లారెడ్డి, నాయకులు బి.ధనపాల్‌రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రషీద్‌గూడలో నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు

- అక్రమ పార్కింగ్, చిరు వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ సమస్య
- అధికారుల సమావేశంలో నిర్ధారణ.. కార్పొరేటర్ ఫిర్యాదు

రాజేంద్రనగర్: ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు, తోపుడుబండ్ల కారణంగా తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని హైదర్‌గూడ, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం హైదర్‌గూడ బస్టాప్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డుపై అక్రమ పార్కింగ్, తోపుడు బండ్లు, తదితరాల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నిర్ధారించారు. దీంతో కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ మంగళవారం శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితో పాటు ట్రాఫిక్ ఏసీపీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ నుంచి హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రహదారి స్థానిక ప్రాంత వాసులకు ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడు రద్దీ ఉంటుంది. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఏర్పాటు చేసిన అనంతరం ఈ రోడ్డును విస్తరించారు. నాలుగు లైన్ల రోడ్డుపై గతంలో రాకపోకలు సాఫీగా సాగేవి. ప్రస్తుతం ఈ రహదారిపై ఇరువైపుల భారీ నిర్మాణాలు, మాల్స్, అపార్ట్‌మెంట్‌లు రావడం.. ప్రధాన వ్యాపార కేంద్రంగా మారడంతో నిర్మాణదారులు పార్కింగ్‌కు చోటు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ వ్యాపార కేంద్రాలకు వస్తున్న వారు తమ వాహనాలను రోడ్లపైనే పార్కు చేస్తున్నారు. దీంతో దుకాణాల ముందు వాహనాలు బారులు తీరుతున్నాయి. దీనికి తోడు తోపుడు బండ్లపై వ్యాపారాలను కొనసాగిస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో ప్రతి రోజు ఈ రహదారిపై పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికి ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



హైదర్‌గూడ చౌరస్తా రహదారిపై చిరు వ్యాపారాల నిర్వహణ



డీసీపీ జగదీశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్

ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తాం



మంచినీటి కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: మంచి నీటి సమస్యకు పరిష్కారం దిశగా నూతనంగా వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 1వ డివిజన్‌లోని ఫీల్‌గుడ్ హోమ్స్, తిరుమల హిల్స్ కాలనీ 5వ డివిజన్‌లోని హీరా కాలనీ, 13వ డివిజన్ వెస్టిన్ కాలనీలలో నూతనంగా నిర్మించిన మంచి నీటి పైప్‌లైన్‌లను మంగళవారం మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా రాందాస్ ముదిరాజ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, మాలతి నాగరాజ్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు నాగరాజ్, గోపాల్ ముదిరాజ్, పాపయ్య యాదవ్, సుమన్‌గౌడ్, కట్ట సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో రక్తదాన శిబిరం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఆరాధ్య బ్లడ్ బ్యాంక్, జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మొత్తం 93 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంజీఐటీ ప్రిన్సిపాల్

ఆక్రమణల కూల్చివేత

మణికొండ: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను నార్సింగి మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలోని గాలిదొడ్డిలో రోడ్లను ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టారు. వాటితో ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వీటిపై అనేకసార్లు పలు ఫిర్యాదులు రావటంతో మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యబాబు మాట్లాడుతూ తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని లేని ఎడల కూల్చివేస్తామన్నారు.కార్యక్రమంలో టీపీఓ సంతోషసింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలిదొడ్డిలో ఆక్రమణల తొలగింపు



16వ రోజు.. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బండ్లగూడ: పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాలు ప్రబలుతాయని ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం 21వ డివిజన్‌లోని టీఆర్ఎస్ పార్టీ భవనం, ఎస్‌బీఐ ఏటీఎం వరకు, ఐసిఐసిఐ ఏటీఎం నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు, ద్వారకా నగర్ కాలనీ ఫేజ్-1,2, పీరంచెరువు కమాన్, హనుమాన్ టెంపుల్ వరకు, మెయిన్ రోడ్డు చండికా నగర్ కాలనీ, 50 గజాలు, 60 గజాలు, ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1,2, హనుమాన్ ఆలయం నుంచి ఇందిరమ్మ కమాన్ మెయిన్‌రోడ్డు, అక్బర్‌నగర్ కాలనీ ఫేజ్ 1,2 తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొర్ర అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్,రామాంజులు, కృష్ణ, వెంకటేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

పోరాటాలతోనే హక్కుల సాధన



బండ్లగూడ: పోరాటాలతోనే హక్కులను సాధించుకుంటామని గండిపేట మండల సీఐటీయూ నాయకులు సురేష్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బండ్లగూడ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలు జరుగుతున్నాయని, విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, సురేష్, నరేందర్, లక్ష్మినారాయణ, జగన్, సుభాష్, ప్రమీల, తిరుపతమ్మ, అంజమ్మ, శారద, ప్రభాకర్, నర్సింహ, మహేష్, మల్లేష్ తదితరులున్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: అఖిల భారత సీఐటీయూ మహాసభల సందర్భంగా రంగారెడ్డిజిల్లా కాటేదాన్ కార్యాలయం ఆవరణలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గట్టయ్య, జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, నాయకులు డి.ప్రేమాజీ, మండల నాయకులు జంగయ్య, ఎంబ గాలయ్య, రాజు, రాజేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.





కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఒగ్గు ప్రవీణ్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు రాజనాల శ్రీదేవి కుమార్తె నందిత లక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు.

టెక్స్‌టైల్స్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం





మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న స్టాల్స్

మాదాపూర్: మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో మంగళవారం క్రాఫ్ట్స్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్స్, క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను సీసీటీ సెక్రటరీ హేమలత వీవర్స్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాన్ ఇండియన్ శ్రేణితో ,భారతీయ కళ ఒకేచోట కొలువుదీరిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో టెక్స్‌టైల్, రంగురంగుల డిజైనర్ సూట్‌లు, తన్వూర్ చేత వైబ్రెంట్‌వేర్, , క్లాసీ టామిక్స్, బనారసీ, హబోచ్ డిజైన్, చందేరీ చీరలు, కుర్తాలు, గద్వాల్, ఇక్కత్ చీరలు, ఆభరణాలు, వివిధ రకాల పెయింటింగ్‌లు అందుబాటులో ఉన్నాయని, రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీటీ మెంబర్ విజయలక్ష్మి, ప్రముఖ వీవర్స్ పాల్గొన్నారు.

